## గ్యాస్ అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాల్లో పోలీసుల దాడులు

బొల్లారం, డిసెంబర్ 14 : ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని గ్యాస్ అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాల్లో పోలీసులు దాడులు చేశారు. ఎస్పీ రూపేశ్ ఆదేశాల మేరకు పారిశ్రామికవాడలో జరుగుతున్న గ్యాస్ అక్రమ రీఫిల్లింగ్ దందాపై నిఘా పెట్టారు. రెండు రోజుల క్రితం జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పలు కేంద్రాల్లో జరిపిన దాడుల్లో పెద్ద ఎత్తున 72 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకోవడమే కాకుండా అక్రమ రీఫిల్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. కాగా గురువారం స్థానిక సీఐ నయీమొద్దీన్ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ సమీపంలోని పలు కాలనీల్లో గ్యాస్ అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాలపై సిబ్బందితో తనిఖీలు నిర్వహించి పదుల సంఖ్యలో సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గృహ సముదాయాల్లో అక్రమ రీఫిల్లింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బొల్లారం పారిశ్రామికవాడలో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

## సమస్యల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

దుబ్బాక/మెదక్ అర్బన్, డిసెంబర్ 14: సమస్యల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని దుబ్బాక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి పి. చందన సూచించారు. గురువారం దుబ్బాక మండలంలోని దుబ్బాక, తొగుట సర్కిల్ పోలీసులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. పోలీసు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 30న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నందున పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐ మున్నూరు కృష్ణ, దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి, తొగుట ఎస్సైలు గంగారాజు, నరేశ్, భువనేశ్వర్, లింగం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈనెల 30న మెదక్ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహిస్తామని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ తెలిపారు.



దుబ్బాక జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశంలో పోలీసు అధికారులకు సూచనలిస్తున్న దుబ్బాక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి చందన

## ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

దుబ్బాక, డిసెంబర్ 14 : ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు సకల వసతులతో కూడిన గుణాత్మక విద్య అందుతున్నదని జిల్లా విద్యాధికారి(డీఈవో) ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగపరచుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. గురువారం దుబ్బాక మండలం తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా వస్తువులు, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానంలో ముందుండాలని సూచించారు. ప్రణాళికబద్ధంగా విద్యనభ్యసిస్తే.. ఉత్తమ ఫలితాలు సాధించగలరని సూచించారు. అనంతరం మండలంలో రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి, అచ్చుమయాపల్లి, కమ్మర్‌పల్లి, టేకుల తండా, శివాజీ నగర్, హబ్షీపూర్ పాఠశాలలతో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో ఎనగుర్తి, తాళ్లపల్లి, పోతారెడ్డిపేట, నగరం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను డీఈవో పర్యవేక్షించారు. ఉపాధ్యాయుల బోధన విధానాలను ఆయన పరిశీలించారు. బోధనలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్‌కనుగుణంగా ఎఫ్‌ఎల్‌ఎన్ డైరీలు, ఉన్నతి డైరీలు రాయాలని, విద్యార్థులకు అర్థవంతంగా బోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో ప్రభుదాస్ ఉన్నారు.



విద్యార్థులకు క్రీడా వస్తువులు అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



తూకం వేసిన సన్నరకం ధాన్యం



సన్నరకం ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

# సన్నాలకు భలే డిమాండ్

## రికార్డు స్థాయిలో సన్న బియ్యం ధరలు

- ఉమ్మడి జిల్లాలో 90 వేల ఎకరాల్లో సాగు
- క్వింటాలు ధాన్యానికి రూ.3వేలు
- క్వింటాలు బియ్యం రూ.5,200పైనే
- పాత బియ్యానికి ధర మరింత ఎక్కువే
- రైతుల వద్ద కొనేందుకు వినియోగదారుల ఆసక్తి

సిద్దిపేట, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో సన్నరకం ధాన్యానికి భలే డిమాండ్ ఉంది. సన్న బియ్యానికి అధిక ధర పలుకుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా చూస్తే సరాసరిగా సన్నరకం ధాన్యం సాగు 80 వేల నుంచి 90 వేల ఎకరాల వరకు సాగైంది. ఇందులో వివిధ రకాలకు చెందిన ధాన్యాన్ని రైతులు పండించారు. సిద్దిపేట జిల్లాలో పండించిన ధాన్యాన్ని నల్గొండ, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల రైతులు నేరుగా ధాన్యం మిల్లులకు తరలించి బియ్యం తయారు చేసి విక్రయిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే గతేడాది కన్న ఈ సంవత్సరం సన్నరకాలకు అధిక డిమాండ్ ఉంది.



### రైతు దగ్గర కొనుగోలు చేస్తేనే మేలు..

ఒక రైతు పండించిన ధాన్యం అంత ఒకే సీడ్‌గా ఉంటుంది. అది అంత ఒకే కూటుగా బియ్యాన్ని చేయిస్తారు. దీంతో ఇతర రకాల సీడ్ బియ్యం ఇందులో కలిసే అవకాశం ఉండదు. బియ్యం పక్కాగా ఉంటుంది. వ్యాపారుల దగ్గర చేయించిన బియ్యంలో కొంత మిళితమయ్యే (వేర్వేరు రకాలుగా) అవకాశం ఉంటుంది. రైతుల వద్ద నేరుగా బియ్యాన్ని కొనుగోలు చేస్తే నాణ్యమైన బియ్యం మనకు దొరికే అవకాశం ఉంటుంది. మొత్తంగా చూస్తే గతేడాది కన్న ఈసారి సన్న రకం బియ్యానికి అధిక డిమాండ్ ఉందని చెప్పొచ్చు. గతేడాది కన్నా దిగుబడి తగ్గడంతో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడంతో ధరలు పెరిగే అవకాశాలున్నాయి. కొద్ది రోజుల నుంచి ధరలు పెరుగుతున్నాయిని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా సన్న రకాలను వానకాలంలో రైతులు సాగు చేస్తుంటారు. కారణం ఏమిటంటే ఈసీజన్‌లో నూక శాతం తక్కువ వస్తుంది. ఆదే యాసంగిలోనైతే నూక శాతం అధికంగా ఉంటుంది. వానకాలంలో ఎక్కువ మంది రైతులు పండించిన దొడ్డు రకం వడ్లను నేరుగా మిల్లులకు తరలించి అమ్ముకున్నారు. జిల్లాలో సన్న రకాల బియ్యం ధరలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. మరి కొన్ని రోజులు ఆగితే మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యాపారులు చెప్పుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాలైన కావేరి చింటు, జైశ్రీరాం, బీపీటీ తదితర వాటికి క్వింటాల్‌కు రూ.5 వేల నుంచి రూ. 5,500 ధర పలుకుతున్నది. మంచి క్వాలిటీ బియ్యం అయితే క్వింటాల్‌కు రూ.6 వేలు పలుకుతున్నాయి. వ్యాపారులు తమ తమ దుకాణాల్లో పంచ రంగుల సంచుల్లో నింపి వివిధ రకాల పేర్లు పెట్టి అమ్ముతున్నారు. ఈ బియ్యంపై జాగ్రత్త అవసరం. వీటిలో చాలా వరకు స్టీమ్ రైస్ నింపి అధిక ధరలకు అమ్ముతున్నారు. రక రకాల పేర్లు పెట్టి అమ్మడంతో వినియోగదారులు మోసపోయే ప్రమాదం ఉంది. బియ్యం కొనే వారు నేరుగా రైతు వద్ద కొనుగోలు చేస్తే నాణ్యమైన బియ్యం దొరుకుతాయి.

### తగ్గిన దిగుబడి.. పెరిగిన ధర

అగ్గితెగులు, మొగిలిపురుగు, బ్యాక్టీరియా, ఎండు తెగులు తదితర తెగుళ్లు వరి పైరుపై ఆశించి పంట దిగుబడి రాలేదు. ఆశించిన దిగుబడి రాకపోయినప్పటికీ పెరిగిన ధరతో రైతుకు కొంతమేర ఉపశమనం కలిగిస్తుందని చెప్పొచ్చు. ఒక ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు ధాన్యం వస్తున్నది. కొన్ని నేలల్లో (భూముల రకాన్ని బట్టి) 18 నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో సిద్దిపేట జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వివిధ రకాల సన్నాలకు ధరలు ఉన్నాయి. సరాసరిగా ఒక క్వింటాల్ సన్నరకాల ధాన్యం రూ.3 వేల నుంచి రూ.3,200 వరకు పలుకుతున్నది. వీటిలో ప్రధాన రకాలు జైశ్రీరాం, ఆర్‌ఎన్‌ఆర్, బీపీటీ, కావేరి, చింటు తదితరలు ఉన్నాయి. వీటి బియ్యం క్వింటాల్‌కు రూ.5 వేల నుంచి రూ.5,500 వరకు, పాత బియ్యం ఒక క్వింటాల్‌కు రూ.6 వేలు పలుకుతున్నది. కొంతమంది రైతులు పంటను వ్యాపారులకు విక్రయించగా, మరికొంత మంది నేరుగా మిల్లుకు తీసుకెళ్లి బియ్యం పట్టించి వారే అమ్ముకుంటున్నారు. నేరుగా రైతుల వద్ద బియ్యం కొనే వారికి క్వింటాల్‌కు ఓ ఐదారు వందల రూపాయలు తక్కువ ధరకు దొరుకుతున్నాయి. వ్యాపారులు వద్ద అధిక ధరలకు సన్న బియ్యం కొనుక్కుంటున్నారు. చాలామంది నేరుగా రైతుల వద్దనే బియ్యం కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

# దున్నకుండా మక్కసాగు



జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగు చేసిన మొక్కజొన్న, (ఇన్‌సెట్లో: జీరో టిల్లేజ్ ద్వారా మక్క సాగుకు సిద్ధం చేసిన భూమి)

## యాసంగికి సిద్ధమవుతున్న రైతన్నలు

- జీరో టిల్లేజ్ పద్ధతిపై ఆసక్తి
- పెట్టుబడి తక్కువ..అధిక ఆదాయం
- తగ్గనున్న ఎరువుల వినియోగం
- రామాయంపేట మండలంలో అధికంగా సాగు

రామాయంపేట రూరల్, డిసెంబర్ 14: వానకాలంలో వరి పండించి యాసంగిలో మొక్కజొన్న సాగు చేసే రైతులు జీరో టిల్లేజ్ (దుక్కు దున్నకుండా మక్కసాగు) ద్వారా సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. రామాయంపేట మండలంలో ఎంతో మంది రైతులు ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయడం వల్ల ఖర్చు తక్కువ కావడంతో పాటు అధిక లాభాలు పొందే అవకాశం ఉన్నది.

### జీరో టిల్లేజ్ పద్ధతి..

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్క జొన్న సాగు చేసుకోవడానికి నవంబర్, డిసెంబర్ నెలలు అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎకరానికి 8 కిలోల విత్తనం అవసరమవుతుందని, వరి కోసిన తరువాత నేలలో తగినంత తేమ లేనట్లయితే తేలికపాటి తడి ఇచ్చి మొక్కజొన్నను విత్తుకోవాలని సూచిస్తున్నారు. తాడును ఉపయోగించి లేదా విత్తనం వేసే యంత్రంతో వరుసకు వరుసకు మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 20 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలి. ఈ పద్ధతిలో కలుపు నివారణ అతి ముఖ్యమైనది. విత్తనం విత్తిన తర్వాత 24 గంటల నుంచి 42 గంటల వ్యవధిలో ఎకరానికి కేజీ అట్రాజిన్ 50 శాతం మందు వాడితే కలుపు తగ్గించవచ్చు. ఎకరానికి లీటరు పెరక్వైడ్ మందు 200 లీటర్ల నీటిలో వాడితే వరి కొయ్యలు ఇగురు పెట్టకుండా నివారించొచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

### ఎరువుల యాజమాన్యం..

ఎకరానికి 160-180 కిలోల యూరియా, 50 కిలోల పొటాష్, 50 కిలోల డీఏపీ(దుక్కి మందు) వేసుకోవచ్చు. విత్తనం విత్తేటప్పుడు ఎకరానికి 40కిలోల యూరియా, 60 కిలోల డీఏపీ, 30 కిలోల పొటాష్ వాడాలి. యూరియా విత్తిన 20 నుంచి 25 రోజులు 40 కిలోలు, 25 నుంచి 40 రోజులు చివరగా మిగిలిన యూరియా వేసుకోవాలి. పూత దశలో 25 కిలోల పొటాష్ వేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది. మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగును నివారించేందుకు మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందే అవకాశం ఉంది.



### సమయం, డబ్బు ఆదా..

జీరో టిల్లేజ్ దుక్కిదున్నకుండా మక్క సాగు చేసే పద్ధతి చాలా మంచిది. రైతులకు ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది.ఈ పద్ధతిలో సాగు చేయడం వల్ల దిగుబడి కూడా పెరుగుతుంది. ఎరువుల వినియోగం చాలా వరకు తగ్గుతుంది. చాలా మంది రైతులకు దీని గురించి అవగాహన లేకపోవడంతో పెట్టుబడులు ఎక్కువ పెట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జీరో టిల్లేజ్ పట్ల అధికారులు రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– రాజ్యానాయక్, రైతు, దామరచెర్వు తండా

### రైతులకు మేలు..



రైతులు వరి సాగు అనంతరం జీరో టిల్లేజ్ ద్వారా మొక్కజొన్న సాగు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. సరైన యాజమాన్య పద్ధతులు పాటించి ఖర్చు తగ్గించుకుని అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే పలువురు రైతులు మండల వ్యాప్తంగా దీనిని అనుసరిస్తున్నారు. భవిష్యత్తులో జీరో టిల్లేజ్ పద్ధతిలో పెద్ద ఎత్తున సాగు చేసేందుకు రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తాం.

– రాజ్ నారాయణ, వ్యవసాయశాఖ అధికారి, రామాయంపేట

# చలికాలం.. జీవాలు పదిలం!

- మేకలు, గొర్రెలకు వ్యాధులు సోకే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు

### పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలి

జీవాలు చలి బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాల విషయంలో పెంపకందారులు ఎక్కువగా శ్రద్ధ వహించాలి. పీపీఆర్(పుర్రు) వైరస్ జీవాలకు సోకే అవకాశం ఉంటుంది. దీని నివారణకు నిర్దిష్టమైన చికిత్స లేదు. రోగాలు రాకుండా దీర్ఘకాలంపాటు పనిచేసే అక్రీటెట్రాసైక్లిన్ వాడవచ్చు. నీరసించిన జీవాలకు గ్లూకోజ్ ఎక్కించవచ్చు. ఈ వ్యాధి టీకా మందును పశుసంవర్ధక శాఖ ఉచితంగా జీవాలకు అందజేస్తుంది. ఆరోగ్యంగా ఉన్న జీవాలకు చర్మం కింద టీకా ఇస్తారు. పెంపకందారులు జీవాలు నివసించే పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి. గాలి, వెలుతురు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.



జీవాలకు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

న్యాల్‌కల్, డిసెంబర్ 14: రోజురోజుకూ చలి తీవ్రత పెరిగిపోతుంది. దీంతో జీవాల్లో పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. జీవాలకు తమ్ములు, కండ్లు, ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు వీటికి కరణమవుతాయి. క్రిములతో సోకే అంటువ్యాధులతోపాటు అరుబయట గడ్డి తినడంతో శ్వాసకోశంలోకి వచ్చే కణాలతో వ్యాధులు వస్తాయి. వ్యాధుల నివారణకు గాలి,వెలుతురు సరిగ్గా వచ్చే విధంగా చూడాలి. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు జీవాలకు బయటకు వదలకూడదు. పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి. ముఖ్యంగా చలి కాలంలో మేకలు, గొర్రెల్లో పీపీఆర్ (పుర్రు) వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి వల్ల ఆరోగ్యమైన జీవాలకు జబ్బు చేసిన జీవాలు దగ్గినప్పుడు వెలువడే తుంపరలో కూడా వ్యాధి కారక వైరస్ ఉంటుంది. వ్యాధి సోకిన జీవాలు పారిన పెండ, ముక్కు, కండ్ల నుంచి వచ్చే ద్రవాలతో వ్యాధి వ్యాప్తించెందే అవకాశం ఉంటుంది. అలాగే జీవాలకు తీవ్రమైన జ్వరం ఉంటుంది. ముక్కు నుంచి నీళ్లు కారడం ప్రారంభమై, ఒకటి, రెండు రోజుల్లో చిమిడి రూపంలోకి మారుతుంది. కండ్లు ఎర్రబడి నీరు కారుతుంది. నోటిలో పలి పొర దెబ్బతిని, చిగుళ్లు పొర సెక్రోసిస్ చెందవచ్చు. ఉపిరితిత్తులకు వ్యాధి సోకడం వల్ల దగ్గు వస్తుంది. దీంతో జీవాలు నీళ్ల పారడం వల్ల 3 నుంచి 4 రోజుల్లోనే చనిపోయే అవకాశం ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

